ఎండుతున్న చెరువులు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- బీటలువారిన పొలాలు
- తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని వేడుకోలు

తపాస్‌పల్లి మల్లన్నసాగర్‌కు కొద్ది దూరంలోనే తపాస్‌పల్లి రిజర్వాయర్ ఉన్నప్పటికీ చెరువుల్లో నీటి నిల్వలు తగ్గుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటల సాగునీటి సరఫరాకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాలువలు నిర్మించింది.


తిమ్మారెడ్డిపల్లి శివారులో ఎండిపోయిన వరి పొలం



తిమ్మారెడ్డిపల్లిలో ఎండిపోయిన బతుకమ్మ చెరువు, (ఇన్‌సెట్) కొండపాకలో పోతిరెడ్డి చెరువు

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో ఈ యాసంగిలో 22,023 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. గత ఏడాది 24 వేల పైచిలుకు ఎకరాల్లో వరి పండించారు. కొమురవెల్లి మండలంలోని 0.5 టీఎంసీల సామర్థ్యంగల తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని కాలువల ద్వారా 32 చెరువులను గోదావరి జలాలతో నింపేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2016లో రూ.42 కోట్లు వెచ్చించి కాలువలు నిర్మించింది. ఈ క్రమంలో ప్రతీ ఏడాది రబీ సీజన్‌లో వరి పంటలకు నీటి కొరత ఏర్పకుండా రిజర్వాయర్ డి4 కెనల్ ద్వారా మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, కొండపాక, దమ్మక్కపల్లి, సిర్సనగండ్ల, నాగిరెడ్డిపల్లి, జప్తినాచారం, మర్పడ్గ, ఖమ్మంపల్లి, రాంపల్లి, దుద్దెడలోని చెరువుల్లోకి నీటిని విడుదల చేసింది. దీంతో యాసంగి వరి పంటలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తలేదు.

తగ్గిన వరిసాగు

2022–23లో కాలువల ద్వారా నీటిని విడుదల చేయకపోయినా యాసంగి వరి పంటలు ఎండిపోకుండా రైతులు కాపాడుకుంటూ వచ్చారు. రెండు మండలాలకు 5 కిలో మీటర్ల దూరంలో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్న సాగర్, పది కిలోమీటర్ల దూరంలో 0.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన తపాస్‌పల్లి రిజర్వాయర్ ఉన్నప్పటికీనీ 2023 యాసంగి సీజన్‌లో చెరువుల్లోకి నీరు విడుదల కాలేదు. ఈనేపథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏడాది కాలంగా వర్షాభావ పరిస్థితులకుతోడు రిజర్వాయర్ నుంచి చెరువుల్లోకి నీరు రాకపోవడంతో నీటి నిల్వలు తగ్గాయి. దీంతో గత ఏడాది కంటే 2 వేల ఎకరాలు వరి సాగు తగ్గింది.

ఆందోళనలో రైతాంగం

రోజురోజుకు పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల కారణంగా బోరుబావుల్లో నీటి నిల్వలు పడిపోతుండటంతో పంటలు ఎండిపోకుండా ఎలా కాపాడుకోవాలో తోచక రైతులు ఆందోళన చెందుతున్నారు. తిమ్మారెడ్డిపల్లి, కొండపాక, సిర్సనగండ్ల గ్రామాలతోపాటు అక్కడక్కడా వరి పొలాలు ఎండిపోతున్నాయంటూ రైతులు చెబుతున్నారు. ఓ వైపు వరి పంటలకు ఆశిస్తున్న మొగి పురుగు బెడద నుంచి కాపాడుకోవడానికి అవస్థలుపడుతున్నారు. భారమవుతున్నా మోతాదుకు మించి మందులను పిచికారీ చేస్తున్నామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరో పదిరోజుల్లో వరి గింజలు (వరి గొలుసు వచ్చే దశ) పాలుపట్టే దశకు చేరుకునే సమయం వస్తున్న తరుణంలో నీటి వినియోగం ఎక్కువగా అవసరపడుతుందన్నారు. నీటి తడులు అందించకపోతే పంట చేతికందక పెట్టుబడులు మీదపడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కాలువల ద్వారా మునుపటి మాదిరిగా చెరువులను నింపి పంటలు ఎండిపోకుండా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

వర్గీకరణతోనే అసమానతలకు అడ్డుకట్ట

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ


కమిటీని ప్రకటిస్తున్న కృష్ణ

గజ్వేల్: దళితుల మధ్య పేరుకుపోయిన సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలు తొలగిపోవాలంటే ఎస్సీల ఏ,బీ,సీ,డీ వర్గీకరణే శరణ్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు మాదిగ అన్నారు. ఆదివారం ప్రజ్ఞాపూర్‌లో ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల కమిటీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వర్గీకరణ సాధనకు రాజీలేని పోరాటం సాగుతుందన్నారు. ఈ పోరాటంలో గ్రామస్థాయి నుంచి మాదిగలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్పీ గజ్వేల్ మండల సీనియర్ నేత పిన్నింటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల కమిటీ అధ్యక్షుడిగా ఉబ్బని ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా చిట్యాల రవీందర్, ఉపాధ్యక్షుడిగా బొంది స్వామి, కోశాధికారి బుర్కి ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా ముంద్రాతి నవీన్, ప్రచార కార్యదర్శిగా కరుణాకర్, కార్యవర్గ సభ్యులుగా చెప్యాల శ్రీకాంత్, రాజు, పొట్ట కరుణాకర్ ఎన్నికయ్యారు.

క్లుప్తంగా

భక్తురాలికి బ్యాగు అప్పగింత


బ్యాగును అందజేస్తున్న పోలీసులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన మహిళ బ్యాగును పోగొట్టుకోగా పోలీసులు తిరిగి ఆమెకు అప్పగించిన సంఘటన కొమురవెల్లిలో జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం సుందరగిరికి చెందిన భక్తురాలు ఇప్ప అనూష ఆదివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చింది. ఆలయ పరిసరాలలో ఆమె తన బ్యాగ్ పోగొట్టుకుంది. ఆ బ్యాగ్ మరోభక్తుడు జి.వెంకటేశ్‌కు దొరకడంతో పోలీసులకు అందజేయగా, వారు బాధితురాలికి అందజేశారు. బ్యాగులో మూడు సెల్‌ఫోన్లు, రెండు తులాల బంగారు చైన్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బ్యాగును అప్పగించిన వెంకటేశ్‌ను పోలీసులు అభినందించారు.

సమ్మక్క సారలమ్మ జాతర


పొట్లపల్లిలో సమ్మక్క సారలమ్మ గద్దెలు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో ఈనెల 21 నుంచి 23 వరకు సమ్మక్క సారలమ్మ జాతర జరుగుతుందని వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల ఆదివారం తెలిపారు. 21న సాయంత్రం సారలమ్మ, 22న సాయంత్రం సమ్మక్క గద్దెకు వస్తారన్నారు. 23న భక్తులు అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకోవచ్చన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లలేని భక్తులు పొట్లపల్లిలో సందర్శించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు


పొట్లపల్లిలో రక్తదానం చేస్తున్న యువకులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో ఆదివారం కరీంనగర్‌కు చెందిన ఓ ప్రైవేటు హాస్పిటల్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు రక్తదానం ప్రాధాన్యత గురించి వివరించారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ దేవసాని నిర్మల, టీఆర్ఎస్ నాయకుడు పాకల శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని అందించాలి

మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య


మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి రైతాంగానికి సాగునీటిని అందించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేయలేదని మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అందులో నిజమెంతో తెలుసన్నారు. నాడు ప్రతిపక్ష నాయకులు ప్రాజెక్టు పనులు జరుగకుండా అడ్డుకున్నా మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ 98 శాతం పనులు చేయించారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే నేరుగా చెల్లించాలి


సమావేశంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

సిద్దిపేటజోన్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీ ద్వారా కాకుండా ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలని రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వ రెవెన్యూ హాల్‌లో సిద్దిపేట డివిజన్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ కార్పొరేషన్ ద్వారా పనికి తగిన సమాన వేతనాలు చెల్లించాలన్నారు.

మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

- 18 నుంచి 25వ తేదీ వరకు నడపనున్న ఆర్టీసీ
- హుస్నాబాద్‌లో టికెట్ కౌంటర్ల ప్రారంభం


హుస్నాబాద్ బస్టాండ్‌లో టికెట్ కౌంటర్లను ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

హుస్నాబాద్: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుతున్నామని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. హుస్నాబాద్ బస్టాండ్‌లో ఆదివారం మేడారం బస్సు టికెట్ కౌంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు డిపో నుంచి మేడారం వరకు 67 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని, మిగతా గ్రామాలకు అదనంగా వచ్చిన మరో 35 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. హుస్నాబాద్ నుంచి మేడారం గ్రామానికి ఫుల్ టికెట్ రూ.350, ఆఫ్ టికెట్ రూ.190 చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఉచిత మెడికల్ క్యాంప్, తాగునీటి సౌకర్యం, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో కార్గో ద్వారా భద్రాద్రి శ్రీరాముడి అక్షింతలు నేరుగా ఇంటికి అందించామన్నారు. ఆ మాదిరిగానే జాతరకు వెళ్లలేని భక్తులు తమ ఇంటి నుంచి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి, కార్గో ద్వారా రూ.299 చెల్లించి బుక్ చేసుకున్న వారికి నేరుగా ఈనెల 25వ తేదీ తర్వాత ఇంటి వద్దకే అమ్మవారి ప్రసాదం అందజేస్తామన్నారు.

కులగణన నిర్ణయం హర్షణీయం


మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్రంలో కులగణన చేసేందుకు అసెంబ్లీ ఆమోదించడం హర్షణీయమని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్ల అజ్జు యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు రాహుల్ జోడో యాత్రలో ప్రకటించిన విధంగా కులగణన చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించిందన్నారు. ఇది బీసీలకు రాజకీయంగా ఎంతో ఉపయోగకరంగా ఉండబోతుందన్నారు. కులగణన చేపట్టకపోవడంతో బీసీలు రాజకీయంతోపాటు రాజ్యాంగ పదవులకు దూరమయ్యారన్నారు. 93 ఏళ్ల అనంతరం బీసీ కులగణన చేపట్టడం సాహసోపేత నిర్ణయమని కొనియాడారు.

మద్దూరు(హుస్నాబాద్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో బీసీ కులగణన బిల్లును ప్రవేశపెట్టాడాన్ని స్వాగతిస్తూ మద్దూరు మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఆదివారం మద్దూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సుందరగిరి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనతో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి, దాసరి పద్మారెడ్డి, మల్లేశం గౌడ్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చలో సెక్రటేరియెట్‌ను జయప్రదం చేయండి

డీడీఎన్ఎస్ రాష్ట్ర గౌరవ సలహాదారుడు శేషం శ్రీనివాసాచార్యులు


శ్రీనివాసాచార్యులు

గజ్వేల్‌రూరల్: ధూప, దీప నైవేద్య సంఘం (డీడీఎన్ఎస్) అర్చకులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ నిర్వహించ తలపెట్టిన చలో సెక్రటేరియెట్‌ను విజయవంతం చేయాలని డీడీఎన్ఎస్ రాష్ట్ర గౌరవ సలహాదారుడు శేషం శ్రీనివాసాచార్యులు పిలుపునిచ్చారు. ఆదివారం గజ్వేల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎలాంటి ఆదాయం లేని, ఆదరణలేని దేవాలయాలకు డీడీఎన్ఎస్ పథకాన్ని ప్రారంభించారన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతరం పలు దఫాలుగా ఈ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 6,500 దేవాలయాలకు విస్తరించినట్లు తెలిపారు. ఈ పథకంలోఉన్న అర్చకులకు ఇచ్చే రూ. 10 వేల గౌరవవేతనంలో రూ.4 వేలు ధూప, దీపనైవేద్య ఖర్చులకు కేటాయిస్తుండగా రూ.6 వేలు అర్చకుల గౌరవ వేతనం ఇస్తున్నారన్నారు. కొత్తగా నియమితులైన డీడీఎన్ఎస్ అర్చకులకు బకాయి ఉన్న 7 నెలల వేతనాలను చెల్లిండంతోపాటు గతంలో నియమితులైన అర్చకులకు పెండింగ్‌లోఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. డీడీఎన్ఎస్ అర్చకుల సమస్యల పరిష్కారం కోసం డీడీఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాదు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సెక్రటేరియెట్‌లో ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి

అవయవదానానికి ఒప్పుకున్న కుటుంబీకులు


ఆంజనేయులుగౌడ్ (ఫైల్)


గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కల్లుగీత కార్మికుడు మృతి చెందాడు. అవయవదానానికి కుటుంబ సభ్యులు ఒప్పుకొని మానవత్వాన్ని చాటుకున్న సంఘటన ఆదివారం జరిగింది. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ(పల్లెపహడ్)కు చెందిన కీసరి ఆంజనేయులుగౌడ్(45) ఇదే గ్రామానికి చెందిన బాల్‌నర్సుగౌడ్‌తో కలిసి రెండ్రోజుల క్రితం గజ్వేల్ మండలం రిమ్మనగూడలో ఈతచెట్ల(కల్లు) తీసేందుకు బైక్‌పై బయలుదేరాడు. ఇదే క్రమంలో ఆర్అండ్ఆర్ కాలనీ సమీప గోదాం వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో అంజనేయులుగౌడ్‌కు తీవ్రంగా, బాల్‌నర్సుకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. వైద్యుల సూచన మేరకు మృతుడి కుటుంబ సభ్యులు ఆంజనేయులుగౌడ్ అవయవదానానికి ఒప్పుకున్నారు. మృతుడికి భార్య లలిత, కుమార్తెలు జ్యోతి, లావణ్య, ఝాన్సీ, భార్గవి ఉన్నారు.

వధూవరులకు ఆశీస్సులు


నూతన వధూవరులతో ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం పలు శుభ కార్యాక్రమాలకు హాజరయ్యారు. వివాహ వేడుకలో నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కనక రాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి


విగ్రహ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ బాలాజీ

గజ్వేల్‌రూరల్: ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమాన్ని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని గజ్వేల్ ఏసీపీ బాలాజీ సూచించారు. వేడుకలకు సిద్ధమవుతున్న పట్టణంలోని శివాజీ విగ్రహ ప్రాంతం, శ్రీ ఉమామహేశ్వర ఆలయ పరిసరాలను గజ్వేల్ సీఐ సైదాతో కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాజీ జయంతి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు.

సమాజానికి బాలసాహిత్యం అవసరం

బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం


బాలసాహిత్య పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బాలసాహిత్య కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రస్తుత సమాజానికి బాలసాహిత్యం ఎంతో అవసరమని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం అన్నారు. మన బాలసాహిత్యం కార్యక్రమం ఆదివారం సిద్దిపేటలో నిర్వహించారు. ఈ సమావేశంలో రాజేశం మాట్లాడుతూ గతంలో చందమామ, బాలమిత్ర, బుజ్జాయిలాంటి మాసపత్రికల ద్వారా నీతి కథలు సమాజానికి చేరేవన్నారు. ప్రస్తుతం అలాంటి పత్రికలు కనుమరుగైనా పత్రికల్లో పిల్లల శీర్షికలతో కథలు గేయాలు, బొమ్మల రూపంలో అందుతున్నాయన్నారు. సామాజిక మాధ్యమాలలోనూ బాలసాహిత్యం విరివిగా రావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి పాఠశాల విద్యార్థులు రాస్తున్న బాలసాహిత్య రచనలకు అవార్డులు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా బాలసాహిత్యం కోసం అహర్నిశలు పాటుపడుతున్న సిద్దిపేట జిల్లా బాలసాహిత్య రచయితల కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో బాలసాహిత్య రచయితలు బస్వ రాజ్‌కుమార్, కోణం పర్శ రాములు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజిరెడ్డి, సత్యనారాయణ, పర్శ రాములు, శివయ్య, రాంచంద్రారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాజిరెడ్డి, నందాదేవి, విజయలక్ష్మి, సరళ, భవాని, పూర్వవిద్యార్థులు వీర్రాజు, భాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి, బాల్‌రెడ్డి, కుమార్, కనకరాజ్, జోత్స్న ఝాన్సీ, రేణుక, శ్యామల, దీపరాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రంజాన్ ఏర్పాట్లపై సమావేశం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రంజాన్ మాసం ఏర్పాట్లు, నిర్వహణపై తంజీమ్ ఉల్ మసాజిద్ ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో తంజీమ్ గౌరవ అధ్యక్షుడు గౌస్ మొయినొద్దీన్, అధ్యక్షుడు ఆసీఫ్ మాట్లాడుతూ ముస్లింలకు పవిత్ర మాసమైన రంజాన్ మరో 20 రోజుల్లో ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆయా మసీద్‌ల్లో వసతులు కల్పించేందుకు కృషి చేయలన్నారు. అలాగే కబ్రస్తాన్‌లో పరిశుభ్రత, మసీద్‌లకు లైటింగ్, ఈద్గా మైదానంలో పరిశుభ్రతపై చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా సోమవారం మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ దుర్గా శ్రీనివాస్ తెలిపారు. తోటపల్లి, పోతారం(ఎస్), పందిల్ల, ధర్మారం, రామవరం, గండిపెల్లి, అక్కన్నపేట, గౌరవెల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని,వినియోగదారులు సహకరించాలని కోరారు.

మిత్రుల చేయూత



గజ్వేల్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రుడికి బాల్యమిత్రులు చేయూత అందించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన యాదగిరి అనారోగ్యానికి గురయ్యాడు. రూ.35 వేల నగదు అందించి తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కుర్రె మహిపాల్‌రెడ్డి, యూసుఫ్‌ఖాన్, హన్మంత రెడ్డి, సంగీతరెడ్డి, మిత్రులు సర్దార్‌ఖాన్, మహిపాల్‌రెడ్డి, కనకరాజు, రవి, స్వామి, కిషన్, నివాస్, బాల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట వార్డుకు చెందిన కొండ బాలకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. చిన్ననాటి స్నేహితులు ఆదివారం మిత్రుడు కుటుంబాన్ని పరామర్శించి రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో స్వామి, శ్రీనివాస్, కొండె గోపాల్ రెడ్డి, ఎల్లం, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

చేర్యాల కవులకు ఘన సన్మానం

చేర్యాల(సిద్దిపేట): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కార్యాలయంలో శ్రీవాణి సాహితీ పరిషత్, సిద్దిపేట రచయితల సంఘం(సిరసం) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో చేర్యాల ప్రాంత కవులు రామచంద్రమూర్తి, ఐలయ్య, ప్రభాకర్, జనార్దన్‌ను ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతలను పలువురు అభినందించారు.



పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

గజ్వేల్‌రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ సాయంతో అప్పగించినట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లోఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన కల్లూరి ప్రసన్న, తీగుల్‌కు చెందిన ఏడుకొండలు తమ మొబైల్ ఫోన్లు పోయాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముందుగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఓ వెబ్‌సైట్‌లో ఐఎంఈఐ నంబరును నమోదు చేసి సిమ్ బ్లాక్ చేశామన్నారు. ఫోన్ దొరికిన వ్యక్తులు దానిలో సిమ్‌కార్డు వేసి ఆన్ చేయడంతో ఈ వెబ్‌సైట్ ద్వారా వివరాలను సేకరించి ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనంగా ఫోన్‌లను ఎత్తుకుపోయినా, ఫోన్లు ఎక్కడైనా పడిపోయినా వెంటనే సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్)లో పూర్తి వివరాలు నమోదు చేసినట్లయితే, వాటి ఆచూకీ కనిపెట్టే అవకాశముందన్నారు. సెల్‌ఫోన్లు అప్పగించినందుకు పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.